నేటి నుంచి ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు

అమీర్‌పేట: ఆషాఢ మాసంలో నిర్వహించే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. భూ ఉపరితలం గర్భగుడిలో వెలసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. 8,9,10 తేదీల్లో జరగనున్న వేడుకల్లో సోమవారం ఉదయం ఆలయంలో వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు ఉంటాయని దేవాలయ కార్య నిర్వహణ అధికారి అంజనీదేవి తెలిపారు. సాయంత్రం ఎదుర్కోళ్ల దేవస్థానం నుంచి బయలుదేరి ఎస్ఆర్‌నగర్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర దేవాలయం వద్దకు చేరి స్వామివారిని ఊరేగింపుగా ఎల్లమ్మ దేవస్థానానికి తరలిస్తారు. మంగళవారం అమ్మవారి కల్యాణం, బుధవారం రథోత్సవంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు 'యశస్వి' స్కాలర్‌షిప్‌లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు ఏఐసీటీఈ యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అండ్ హోలిస్టిక్ అకాడమిక్ స్కిల్స్ వెంచర్ ఇనిషియేట్ (యశస్వి) పేరుతో 2024-25 విద్యా సంవత్సరం నుంచి స్కాలర్‌షిప్‌లను అందచేయనున్నారు. దేశ వ్యాప్తంగా ఐదు వేల మంది ఇంజినీరింగ్ చదివే వారికి రూ.18,000, ఐదు మంది డిప్లొమా విద్యార్థులకు రూ.12,000 స్కాలర్‌షిప్ అందచేయనున్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఏబీవీపీ టెక్నికల్ కన్వీనర్ తోట శ్రీనివాస్ పేర్కొన్నారు.

సీఐ రవీందర్ రెడ్డిని విధుల నుంచి తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ మృతికి కారకులైన సీఐ రవీందర్ రెడ్డి, ఐదుగురు కానిస్టేబుళ్లపై మాల సంఘాల నాయకులు ఆదివారం మండిపడ్డారు. భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట ఎస్ఐగా పని చేస్తున్న శ్రీరాములు శ్రీనివాస్‌ను సీఐ రవిందర్ రెడ్డి, కానిస్టేబుల్స్ వేధించడంతోనే ఆత్మహత్యయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మరణించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బాధ్యులైన సీఐ రవీందర్ రెడ్డితో పాటు, కానిస్టేబుళ్లను విధుల నుంచి తొలగించాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హుస్సెన్ డిమాండ్ చేశారు.అంసా ఓయూ అధ్యక్షులు నామా సైదులు, మాల సంఘాల నేతలు బోయాల అఖిల్, వేణు, గాజుల నర్సయ్య పాల్గొన్నారు.

ఆమ్రపాలికి కీలక పదవుల పట్ల హర్షం


తల్లమల్ల శ్వేతహుస్సెన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఐఏఎస్ అధికారి ఆమ్రపాలిని ఆరు కీలక పదవుల్లో నియమించడం పట్ల తెలంగాణ అంబేడ్కర్ రాష్ట్రీయ ఎక్తామంచ్ రాష్ట్ర మహిళ అధ్యక్షులు, ఓయూ జేఏసీ కన్వీనర్ తల్లమల్ల శ్వేత హుస్సెన్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఓ మహిళా ఐఏఎస్‌ను తెలంగాణ ప్రభుత్వం ఆరు కీలక పదవులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళల అభివృద్ధి కోసం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించారన్నారు. చురుకుగా పని చేసే వారికి ఎక్కువ పదవులలో నియమిస్తే వారికి కులాలను ఆపాదించవద్దన్నారు.

ఎమ్మెల్యే చొరవ.. తీరిన కరెంటు కష్టాలు


నూతన కేబుల్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్ ఎన్‌బీటీనగర్ వాసుల కరెంటు కష్టాలు తీరాయి. ఇప్పటి వరకు ఉన్న హైటెన్షన్ కేబుల్‌తో తరచూ మంటలు వస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యేవారు. స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నేతలు శేఖర్‌ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి నూతన హైటెన్షన్ కేబుల్ ఏర్పాటు చేసేలా చొరవ తీసుకున్నారు. కరెంటు కష్టాలు తీర్చిన శ్రీనివాస్‌యాదవ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటు వర్సిటీల బిల్లును ఉపసంహరించుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రైవేటు వర్సిటీల బిల్లును ఉపసంహరించుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లెపల్లి స్వామి పేర్కొన్నారు. కొత్తగా అనుమతి పొందిన గురునానక్, ఎంఎన్ఆర్, కావేరి, ఎన్ఐసీఎంఎఆర్ ప్రైవేటు వర్సిటీల గుర్తింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు వర్సిటీలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వర్సిటీలను బలోపేతం చేయాలని కోరారు.

రవీందర్ రెడ్డికి డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) విభాగం విద్యార్థి బుక్క సముద్రం, రవీందర్ రెడ్డికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీఎస్‌ఈ విభాగం అధ్యాపకురాలు ప్రొ.ఆది లక్ష్మి పర్యవేక్షణలో 'ఏ మెర్కెల్ ట్రీ సైఫర్టెక్స్ పాలసీ అట్రిబ్యూట్ బెస్ట్ ఎన్‌క్రిప్షన్ మోడల్ ఫర్ ప్రైవసీ ప్రిసర్వింగ్ ఆఫ్ హెల్త్‌కేర్ అట్రిబ్యూట్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ లభించింది.

నియామకం


పొన్నం ప్రభాకర్‌కు బొకే అందజేస్తున్న విశాల్ సూదం

సనత్‌నగర్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయ బోనాల ఉత్సవ కమిటీ సభ్యుడిగా బేగంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సూదం నియమితులయ్యారు. ఈ సందర్భంగా విశాల్ సూదం మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం మహంకాళి ఆలయానికి రూ.16.50 లక్షలను కేటాయించారని తెలిపారు. ఈ మేరకు మంత్రులు పొన్నంప్రభాకర్, కొండా సురేఖ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.43, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 48, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 45, పందిరి బీర 28, క్యాబేజీ 33, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 95, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 25, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 39, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 13.

ఘనం.. ఘటోత్సవం

- ప్రారంభమైన మహంకాళి బోనాలు
- హాజరైన మంత్రులు, ప్రముఖులు


బోనాలతో వస్తున్న భక్తులకు స్వాగతం పలుకుతున్న మంత్రి కొండా సురేఖ


మహంకాళి అమ్మవారు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవాలు కోలాహలంగా ప్రారంభం అయ్యాయి. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఘటాల ఎదుర్కోళ్ల ప్రారంభం అయింది. మధ్యాహ్నం అమ్మవారి ఘటోత్సవాలను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఘటాన్ని అలంకరించే వస్తువులను అనువంశిక ధర్మకర్తలకు అందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల కోసం రూ.20 కోట్లు విడుదల చేశామని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

కోలాహలంగా బోనాలు

మహంకాళి బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉజ్జయినీ మహంకాళి, మాణిక్యాలమ్మ సేవా సమితి అధ్యక్షులు కఠారి మహేష్ కుమార్, రమణ రాజు, మోహన్, మురళి మోహన్, సంతోష్, ప్రవీణ్ యాదవ్, శరత్, శేఖర్, సీ బాబురావు ఆధ్వర్యంలో అమ్మవారికి బోనం సమర్పించారు. డీజే చిందులు, పోతరాజుల వీరంగాలు, డప్పుల దరువులు నడుమ కోలాహలంగా అమ్మవారికి బోనం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ, కఠారి రాజు, గడ్డం అశోక్‌ల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

పోలీసుల అత్యుత్సాహం..

అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయగా వందల మంది భక్తులు ఇందులో పాల్గొన్నారు. అయితే భక్తులు భోజనాలు చేస్తుండగా మంత్రులు వస్తున్నారనే సమాచారంతో అక్కడే ఉన్న డీసీపీ, ఏసీపీ పోలీసులు అన్నదానాన్ని అక్కడి నుంచి తొలగించారు. గత కొద్ది సంవత్సరాలుగా భక్తులు భోజనాలు చేస్తున్నా మంత్రులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని వెళ్లేవారు. కానీ పోలీసు అధికారులందరూ కొత్త వాళ్లు కావడంతో భోజనాలు చేస్తున్న భక్తులు, నిర్వాహకులను అక్కడి నుంచి దేవాలయం వెనుక వైపు పంపించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అందంగా అమ్మవారి ఘటం



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బుద్ధభవన్ ఎదురుగా ఉన్న అమ్మవారి దేవాలయంలో మహంకాళమ్మ ఘటాన్ని ముస్తాబు చేశారు. డప్పుచప్పుళ్ల బ్యాండ్ మేళాలు, పోతరాజుల వీర నృత్యాల మధ్య అమ్మవారి ఘటాన్ని పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. జీరా ఇందిరానగర్ నుంచి ప్రారంభమైన అమ్మవారి ఘటం ఎదుర్కోళ్ల కర్బలామైదాన్ చౌరస్తా, డిస్టలరీ రోడ్డు, రాణిగంజ్, పాన్‌బజార్, సుభాష్ రోడ్డు గుండా మహంకాళి దేవాలయానికి చేరుకుంది. సికింద్రాబాద్ మహంకాళమ్మ దేవాలయం అమ్మవారి ఘటాన్ని వెదురుబద్దలతో తయారు చేసి చుట్టూ వేపాకులు పువ్వులతో అందంగా ముస్తాబు చేశారు. అమ్మవారి ఘటాన్ని ప్రతి రోజు వివిధ ప్రాంతాల్లో భక్తుల సందర్శనార్థం ఊరేగిస్తారు. రాణిగంజ్, పాన్ బజార్ ప్రాంతాల్లో మహంకాళి అమ్మవారి ఘటానికి ఆదివారం రాత్రి వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వాగతం పలికారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తరాదు


సమావేశంలో పాల్గొన్న నూతన కార్యవర్గం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించేందుకు దక్కన్ మానవ సేవా సమితి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని సమితి ప్రతినిధులకు సూచించింది. ఆదివారం దక్కన్ మానవ సేవా సమితి కార్యవర్గ సమావేశాన్ని మహంకాళి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా ధరంవీర్ ఆర్యతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అంతకు ముందు ఇటీవల మరణించిన సమితి కార్య నిర్వాహక అధ్యక్షులు శీలం ప్రభాకర్‌కు నివాళి అర్పించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సమితి ప్రతినిధులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, సీకే నర్సింగ్‌రావు, వినీల్, శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్, గున్నాల రవికాంత్, రాజ్‌కుమార్, చిదంబరం, హరిబాబు, శీలం సాయి. విశాల్, శీలం అనురాగ్, ఆకుల రమేష్ తపాల్గొన్నారు.

తుకారాంగేట్ ఎస్‌హెచ్‌ఓగా శంకర్



అడ్డగుట్ట: శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు కృషి చేస్తానని తుకారాంగేట్ నూతన ఎస్‌హెచ్‌ఓ మాలోత్ శంకర్ పేర్కొన్నారు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్‌గా ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విధులు నిర్వహించిన మాలోత్ శంకర్ బదిలీపై తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌కు రాగా.. ఇది వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆంజనేయులు సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

పర్మనెంట్ వీసీని నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు పర్మనెంట్ వీసీ లేకపోవడంతో పాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మే 21న వీసీ ప్రొ.రవీందర్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి దాన కిశోర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద వర్సిటీ ఓయూకు పర్మనెంట్ వీసీ లేనందున్న రోజువారి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఓయూకు 24 గంటలు వీసీ సేవలు అవసరం, ఇన్‌చార్జి వీసీలు బీజీగా ఉండటంతో అత్యవసర సమయంలో నివాసానికి వెళ్లాల్సి వస్తోంది. త్వరితగతిన పర్మనెంట్ వీసీని నియమించాలని విద్యార్థులు, ఉద్యోగులు కోరుతున్నారు.

ఓయూ సెల్ట్ మూసివేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న ఇంగ్లిష్ శిక్షణ కేంద్రం (సెల్ట్)ను మూసివేశారు. ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులతో పాటు ఆసక్తి గల బయటి వ్యక్తులకు కూడా స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చేవారు. వేసవిలో పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను సైతం ప్రదానం చేసేవారు. కానీ ఇంజినీరింగ్ కాలేజీకి పర్మనెంట్ ప్రిన్సిపల్ నియమించనందున, ప్రొఫెసర్ల కొరతతో ఉన్న అధ్యాపకులపై పని ఒత్తిడి కారణంగా శిక్షణ నిర్వహణ సరిగా లేనందున విద్యార్థులు చేరడం లేదని సెల్ట్‌ను మూసివేశారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత


వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు

రసూల్‌పురా: మొక్కలు నాటడం అందరి బాధ్యత అని రెయిన్‌బో హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పేర్కొన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుమలగిరి బంజారానగర్ కాలనీ పార్కులో స్థానికులతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. మాతృభూమిని కాపాడేందుకు ప్రతి ఒక్కరు పచ్చదనానికి పెద్దపీట వేస్తూ మొక్కలు నాటే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వ్యవస్థాపక అధ్యక్షులు జీవీవీఎస్. మూర్తి, వైవీ. రావు, అంథోని, అస్లాం, కాలనీవాసులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి


ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ కోరారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ గుంటి కృష్ణ, సభ్యులు, హక్కుదారులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ నెల 28,29 తేదీలలో జరిగి చిలకలగూడ బోనాల జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్ట్‌బోర్డు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. దేవేందర్‌యాదవ్, జగన్‌రెడ్డి, ఎక్స్ అఫీషియో సభ్యుడు, ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు, భక్తులు రవిశంకర్, చోటప్రభు, రాజు, యాదగిరి, బట్టల శ్రీను పాల్గొన్నారు.

సీ-సెక్షన్‌లో లోప్రెషర్ సమస్యకు పరిష్కారం


సీ- సెక్షన్‌లో పర్యటిస్తున్న జీఎం వినోద్‌కుమార్

అడ్డగుట్ట: డివిజన్‌లోని సీ-సెక్షన్‌లో తాగు నీటి సరఫరా సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన అడ్డగుట్ట సీ-సెక్షన్ ప్రాంతంలో పర్యటించి నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా మంచినీటి పైపుల మరమ్మతుల కారణంగా నీటి సరఫరా సరిగా జరగలేదని స్థానికులు ఎదుర్కొన్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయన్నారు. పలు పైప్‌లైన్లలో రాళ్లు పేరుకుపోవడంతో తాగు నీటి సరఫరాలో ఆటంకం కలిగిందన్నారు. ఆయన వెంట జలమండలి ఏఈ స్రవంతి, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే సీపీఎం బస్తీబాట


బస్తీబాటలో పాల్గొన్న సీపీఎం నేతలు

అడ్డగుట్ట: నగర ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ చేపట్టిన బస్తీ బాట కార్యక్రమం ఆదివారం సీ-సెక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా స్థానికంగా నెలకొని ఉన్న సమస్యలపై కూడా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అజయ్ బాబు, ఆర్. మల్లేష్, ఫాతిమా, నర్సింగ్‌రావు, పాషా, శంషాద్ బేగం, మోహన్, శ్రీనివాస్, జ్యోతి, శ్రీలత పాల్గొన్నారు.

పద్మగ్యాస్ కార్యాలయంలో చోరీ

బౌద్ధనగర్: ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్ సమీపంలోని పద్మగ్యాస్ కార్యాలయంలో తాళాలు పగులగొట్టి రూ. 13వేల నగదు, చెక్‌బుక్, విలువైన పత్రాలు దోచుకెళ్లిన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. అదివారం ఉదయం 6 గంటలకు స్వీపర్ అంజమ్మ వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండటంతో యజమాని గంగాధర్ గుప్తాకు సమాచారం ఇచ్చింది. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం

రాంగోపాల్‌పేట్: భార్యతో గొడవపడి ఓ వ్యక్తి బ్లేడ్‌తో గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఒరిస్సాకు చెందిన జలందర్ నహక్ కుటుంబంతో కలిసి టోలిచౌకిలో ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా మానసికంగా ఆయన పరిస్థితి బాగా లేదు. ఆదివారం ఒరిస్సా నుంచి సికింద్రాబాద్‌కు భార్యతో కలిసి వచ్చాడు. ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న అతడిని మార్కెట్ పోలీసులు 108 సహకారంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రిన్సిపాల్‌పై దాడికి ఖండన

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మహిళ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శైలజపై దాడిని ఓయూ జేఏసీ నాయకులు గుండు లక్ష్మీనారాయణ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓయూలో వార్డెన్, నిజాం కాలేజీలో అధ్యాపకురాలిగా పని చేసిన ఆమెను మహిళా కాలేజీ ప్రిన్సిపల్‌గా నియమించారు. ఆమె ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు దాడి చేశారని వెంటనే వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు జోగు నరేందర్, రామకృష్ణ, వెంపటి శ్రీకాంత్, సందీప్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా

ఎమ్మెల్యే శ్రీగణేశ్


బస్తీలో వాసులతో మాట్లాతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం ఒకటో వార్డు సంజీవయ్య నగర్‌లో పర్యటించి బస్తీవాసులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్తీకి వచ్చినప్పుడు తనకు పలు సమస్యలపై స్థానికులు విన్నవించారని అన్నారు. సమయాభావం వల్ల ప్రచారంలో బస్తీ సమస్యలను పూర్తిగా తెలుసుకోలేకపోయనన్నారు. ఈ నేపథ్యంలోనే బస్తీ పర్యటనకు వచ్చానని వివరించారు. బస్తీలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తానన్నారు. కమ్యూనిటీ హాల్‌కు అవసరమైన వంటగది, టాయిలెట్, మంచినీటి సదుపాయాలను కల్పిస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట జంపన ప్రతాప్, ఆనంద్ బాబు, బాణాల శ్రీనివాస్ రెడ్డి, ముప్పిడి మధుకర్, బల్వంత్ రెడ్డి, హరికృష్ణ, మారుతి, వరదారాణి, వందన, అశోక్, యాదగిరి, రామారావు పాల్గొన్నారు.


- ఐదో వార్డు శ్రీసాయి అపార్ట్‌మెంట్‌కు బోర్డు నుంచి తాగునీటి సదుపాయం లేకపోవడంతో ఫ్లాట్‌ల యజమానులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించగా సంబంధిత అధికారులతో మాట్లాడి అపార్ట్‌మెంట్‌కు తాగునీటి సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

రసూల్‌పురా: బొల్లారం జనరల్ ఆసుపత్రిలో మెరుగైన వసతులు, బస్తీల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. ఆదివారం బొల్లారంలో తోటి, మేథర కమ్యూనిటీ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా తోటి మేథర సంఘం నాయకులు అసంపూర్తిగా ఉన్న తమ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జైప్రకాష్, ఖదీరవన్, నరసింహన్, వేణుగోపాల్ రెడ్డి, బాల్‌రాజు, శ్రీనివాస్, సుభాష్ రెడ్డి అమర్ రాజు, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

చివరి దశకు ఎస్సీ వర్గీకరణ

మందకృష్ణ మాదిగ


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మందకృష్ణ మాదిగ

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ముప్పై ఏళ్లుగా నిలబడడానికి మాదిగల సంకల్ప బలం, సమాజం అందించిన అండదండలే ప్రధాన కారణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసిన అనంతరం ఆధునీకరించిన ఎమ్మార్పీఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అనే ఆశయం గొప్పది కనుక సమాజం మొత్తం ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలబడిందన్నారు. మాదిగల కోసమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా ఎమ్మార్పీఎస్‌ను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం ప్రస్తుతం అంతిమ దశలో ఉందని, ధర్మం గెలిచి మాదిగలు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, మాజీ ఎంపీ వెంకటేష్ నేత, బీసీనేత కందుకూరు జగదీశ్వర్‌రావు, ఎంఎస్ఎఫ్ నాయకులు రాగాటి సత్యం, తప్పొరపు లక్ష్మణ్, సోమశేఖర్, శేఖర్, మల్లికార్జున్, బస్తీవాసులు మల్లేష దేవేందర్, మురళీధర్, మల్లేష్ పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాడుతాం


జెండావిష్కరణలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు


గొల్లకొమురయ్య కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కంటోన్మెంట్: ఎస్సీ వర్గీకరణ లక్ష్యాన్ని సాధించే వరకు తమ పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి శ్రీకిషన్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవాలను పురస్కరించుకుని బోయిన్‌పల్లిలో మంద మధుకర్ మాదిగ, బ్యాగరి నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరణ చేశారు. అనంతరం శ్రీకిషన్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ మాదిగలకు ఆత్మ గౌరవాన్ని అస్తిత్వాలు గుర్తింపును తీసుకొచ్చిందన్నారు. మంద మధుకర్ మాదిగ, బ్యాగరీ నరసింహ, మక్కల అశోక్, అంజయ్యనగర్ పవన్, బాబెందర్, సాయి, రమేష్, చిన్న, గిరి, గురు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు కమ్యూనిస్టుల పోరాటాలే ప్రత్యామ్నాయం

అడ్డగుట్ట: పాలక వర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు కమ్యూనిస్టుల పోరాటాలే ప్రత్యామ్నాయమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాధగోని రవి అన్నారు. ఆదివారం అడ్డగుట్టలోని ఎంసీపీఐ(యూ) కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముందుగా ఏ-సెక్షన్‌లోని అమరజీవి కామ్రేడ్ ఉపేందర్ స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె మల్లేష్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాదె మల్లేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పది సంవత్సరాలలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి పేరుతో అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంభించిందన్నారు. ఆ పార్టీని తిరస్కరించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే ప్రస్తుతం పెట్టుబడిదారి కార్పొరేట్ శక్తులకు అనుగుణమైన విధానాలతో పాలిస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలక స్వభావం ఒకటేనని పేర్కొన్నారు.అనిల్‌కుమార్, సుధాకర్, సుకన్య, పుష్ప, దశరథ్, రాంబాబు, యాదగిరి, లక్ష్మణ్, లక్ష్మీ, రాజు, లావణ్య, శివాని, లలిత, పార్వతి పాల్గొన్నారు.

అమ్మవారికి జలాభిషేకం


జలాభిషేకంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

రసూల్‌పురా: ఆషాఢమాసం తొలి ఆదివారం సందర్భంగా అన్నానగర్‌లోని పోచమ్మ ఆలయంలో అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో పాటు బస్తీకి చెందిన పలువురు మహిళలు ఊరేగింపుగా వచ్చి వేప కొమ్మలు సమర్పించి బిందెలతో జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు యాదగిరి మాట్లాడుతూ.. బోనాల జాతరకు ముందు మొదటి ఆదివారం అమ్మవారికి జలాభిషేకం చేస్తే కోరిన కోరికలు తీరుతాయని బోనాలు ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని భక్తుల నమ్మకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్ దేవులపల్లి శ్రీనివాస్, అన్నానగర్ మురళి, ధర్మేందర్, ఆలయ అర్చకులు ఆచ్యుత శర్మ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సనత్‌నగర్: యూనివర్సల్ హ్యూమన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం సనత్‌నగర్ జెక్‌కాలనీలోని మహాత్మాగాంధీ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా డీఎస్‌రావు, కోశాధికారిగా ఎండీ ఇబ్రహీం, సభ్యులుగా భానోజీరావు, సుదర్శన్‌రావు, గౌరవాధ్యక్షులుగా సీహెచ్.అనంతరెడ్డి, డాక్టర్ మల్లు ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం కోసం అసోసియేషన్ తరుపున వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు చేయూతనందించడం, సామాజిక రుగ్మతలపై ప్రజలను చైతన్యం చేయడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు వివరించారు.


నూతన కమిటీ సభ్యులు